క్లుప్తంగా

ట్రాఫిక్ సిగ్నల్ లైట్ల పరిశీలన

మచిలీపట్నంటౌన్: నగరంలోని పలు కూడళ్లలో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్ లైట్ల పనితీరును ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) గురువారం రాత్రి బందరు డీఎస్పీ మాసూం బాషా, చిలకలపూడి సీఐ రాజశేఖర్‌లతో కలిసి పరిశీలించారు. ట్రాఫిక్ సిగ్నల్ లైట్లు అందుబాటులోకి వస్తే నగరంలోని ట్రాఫిక్ కొంత వరకు నియంత్రించవచ్చన్నారు.

ధాన్యం కొనుగోళ్లపై దుష్ప్రచారాన్ని నమ్మవద్దు

తహసీల్దార్ నవీన్‌కుమార్

మోపిదేవి: మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద ధాన్యం కొనుగోలు యథావిధిగా సాగుతోందని తహసీల్దార్ కె. నవీన్‌కుమార్ అన్నారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయడం లేదని కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని, దీనిని నమ్మవద్దని రైతులకు సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని చల్లపల్లి, మోపిదేవి మండలాల్లోని రైస్‌మిల్స్‌కు పంపుతున్నారని చెప్పారు. దీనిపై ఏదైనా సమాచారం కావలసిన వారు గ్రామంలోని రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించాలని కోరారు.

హెచ్ఐవీపై అవగాహన

కృత్తివెన్ను: హెచ్ఐవీ బాధితుల పట్ల వివక్ష చూపరాదని, వారికి మనోస్థైర్యాన్ని ఇవ్వాల్సిన అవసరం అందరిపై ఉందని చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ ఆర్. సత్యవతి అన్నారు. గురువారం చినగొల్లపాలెం సచివాలయం-2 వద్ద ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ సంస్థ చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఐవీ సోకే విధానం, తీవ్రత, చికిత్స అంశాలపై అవగాహన కల్పించారు.

ఆక్రమణలు తొలగించాలి

గంజివానిపాలెం(మోపిదేవి): గంజివానిపాలెం దళితవాడలో రహదారులను సర్వే చేయించి ఆక్రమణలు తొలగించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గ్రామస్తులు గురువారం తహసీల్దార్ కె. నవీన్ కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. గ్రామస్తులు మాట్లాడుతూ 2.50 ఎకరాల్లో ఇళ్లస్థలాలు కేటాయించారని, ప్రస్తుతం ఆక్రమణల వల్ల రహదారులు మూసుకు పోయాయని చెప్పారు. గ్రామానికి కేటాయించిన శ్మశాన వాటిక కూడా ఆక్రమణలకు గురైందని, దీనిని కూడా సర్వే చేయించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు సభ్యురాలు భారతి, ధనలక్ష్మి, జి. బుజ్జి, కిషోర్, నాగలక్ష్మి, కె. కోటేశ్వరావు, దిలీప్ పాల్గొన్నారు.

ముగిసిన విష్ణు సహస్రనామ పారాయణ ఏకాహం

కోడూరు: భీష్మ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఉల్లిపాలెం గోదా, రాజ్యలక్ష్మీ సమేత శ్రీమన్నారాయణ స్వామివారి ఆలయంలో ప్రారంభించిన విష్ణు సహస్ర నామ పారాయణ ఏకాహం గురువారం ఉదయంతో ముగిసింది. రాష్ట్ర గోదా విష్ణు సహస్ర నామ పరివార్ ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాలకు చెందిన 55 భక్తమండళ్ల సభ్యులు బుధవారం ఈ పారాయణ ఏకాహాన్ని ప్రారంభించారు. ఆలయ నిర్మాణకర్త త్రిదండి అష్టాక్షరీ సంపత్ కుమార రామానుజీయర్ స్వామిజీ పర్యవేక్షణలో 24గంటల పాటు నిర్విరామంగా పారాయణాన్ని భక్తులు నిర్వహించారు. ముగింపు సందర్భంగా స్వామివారి ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

బంటుమిల్లి: పెదతుమ్మిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) వైద్యులు, సిబ్బంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పీహెచ్‌సీ ఆధ్వర్యంలో జరుగుతున్న కుష్ఠు వ్యాధి పక్షోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమం జరిగింది. వైద్యాధికారి జయశ్రీ విద్యార్థులకు పరీక్షలు చేసి కుష్ఠు వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. హెచ్ఎం ధర్మారావు, సూపర్‌వైజర్లు ఎం. ఏసుదాసు, ఎంవీ ప్రసాద్, కమలరత్నం, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నేడు మల్లవోలులో గడప గడపకు మన ప్రభుత్వం

గూడూరు: మల్లవోలు పంచాయతీ పరిధిలోని మల్లవోలు-1 గ్రామ సచివాలయం పరిధిలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ డి.సుబ్బారావు తెలిపారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ఉదయం 9 గంటల నుంచి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించి లబ్ధిదారులకు బ్రోచర్లు అందజేస్తారని చెప్పారు.

ముమ్మరంగా జంగిల్ క్లియరెన్స్

కోడూరు: ఈ నెల 5న హంసలదీవి సాగర తీరంలో జరిగే సింధు స్నానాలను పురస్కరించుకొని జంగిల్ క్లియరెన్స్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఆర్అండ్‌బీ, పంచాయతీ రాజ్ శాఖల ఆధ్వర్యంలో దింటిమెరక గ్రామం నుంచి పాలకాయతిప్ప వరకు రహదారికి ఇరువైపులా జేసీబీ సహాయంతో ముళ్లచెట్లను తొలగిస్తున్నారు. పాలకాయతిప్ప కరకట్ట నుంచి బీచ్ వరకు ఉన్న రహదారి వెంట కూడా జంగిల్ క్లియరెన్స్ పనులు సాగుతున్నాయి. బీచ్ రహదారికి మరమ్మతులు చేస్తున్నారు.

నేటి నుంచి ఉత్సవాలు

పెడన: దేవాంగుల ఆరాధ్య దైవం చౌడేశ్వరీ దేవి జ్యోతిర్మయి ఆరాధనోత్సవాలు శుక్రవారం నుంచి ఈ నెల 6వ తేదీ వరకు నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పెడన పట్టణ పరిధిలోని 2వ వార్డు పడమట వీధిని చలువ పందిళ్లు, విద్యుత్ దీపాలతో అలంకరించారు.

పేదలకు జగనన్న ప్రభుత్వం అండ

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు, చిత్రంలో నరసింహారావు, నాయకులు

మోపిదేవిలంక(మోపిదేవి): వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తూ పేదలకు అండగా నిలుస్తోందని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. మోపిదేవిలంకలో విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ పరిశీలకుడు కడవకొల్లు నరసింహారావుతో కలిసి స్థానిక టీడీపీ నాయకులు వేములపల్లి వెంకట్రామయ్య గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని 349 గృహాలను సందర్శించగా ప్రతి ఇంటా అపూర్వ స్వాగతం లభించింది. ఇంటింటా సంక్షేమ పథకాలు అందుకున్న లబ్ధిదారులను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమానికి మారుపేరుగా నిలిచిన ముఖ్యమంత్రి జగనన్న వెంటే ఉంటామని యువకులు సంతోషంగా ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. స్థానికులు మాట్లాడుతూ కడుపులో పడిన బిడ్డ నుంచి పండు ముదుసలి వరకు సంక్షేమ పథకాల ద్వారా అండగా ఉంటున్న జగనన్నకు తోడుగా ఉంటామని అన్నారు. మళ్లీ మళ్లీ ముఖ్యమంత్రిగా జగనన్నే రావాలంటూ దీవించారు. నూతనంగా చేపట్టిన గృహ నిర్మాణానికి ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబుచే శంకుస్థాపన చేయించి అభిమానం చాటుకున్నారు. మాజీ సర్పంచ్ తురక మంగమ్మ ఎమ్మెల్యే సింహాద్రి, కడవకొల్లును ఆశీర్వదించారు. చిరివెళ్ల దళితవాడలో సిమెంట్ రోడ్డుపైనే నిలబడిన టీడీపీ మహిళా అభిమాని రోడ్డు వేయలేదని ఎమ్మెల్యేను అడగడంపై స్థానికులు విస్మయం వ్యక్తంచేశారు. సర్పంచ్‌లు మోర్ల జ్యోత్స్న, గరికిపాటి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీలు సనకా వెంకట రాజేష్‌బాబు, కారుమూరి శివనాగ రాజు, పీఏసీఎస్ చైర్‌పర్సన్లు గరికిపాటి గోవింద రాజులు, రెడ్రౌతు వెంకటరమణ, తుటారం కృష్ణ, మండల బీసీ కన్వీనర్ రాజులపాటి నాగేశ్వరరావు, మోర్ల శ్రీనివాసరావు, బెజవాడ వనమలయ్య, రాయన సత్యనారాయణ, నందిగం అభిషేకరావు, మీసాల చిట్టిబాబు, కామిశెట్టి వెంకట సురేష్‌బాబు, పలు శాఖల అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నవరత్నాలతో ఆర్థిక భరోసా..



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో నవరత్నాల పథకాల అమలు ద్వారా పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా లభిస్తోందని వైఎస్సార్ సీపీ నాయకుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. గురువారం పదో డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ షేక్ ముంతాజ్, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జ్ షేక్ బాషాతో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వివిధ పథకాల ద్వారా పొందిన లబ్ధిపై ముద్రించిన కరపత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. పేర్ని కిట్టు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్యం, సామాజిక అంశాల్లో కుటుంబాలు అభివృద్ధి చెందేందుకు పలు రకాల పథకాల ద్వారా చేయూతను అందిస్తున్నారన్నారు. ఫలితంగా ఆయా కుటుంబాలు గతం కంటే మెరుగైన జీవనం సాగిస్తున్నాయని చెప్పారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్ దాదా, వైఎస్సార్ సీపీ నాయకులు పురంశెట్టి శ్రీనివాసరావు, సుంకర రాఘవరావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు ఆరోగ్యానికి మేలు



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న పార్థసారథి

కోనేరుసెంటర్: ప్రకృతి వ్యవసాయం ఆరోగ్యానికి మేలు చేస్తుందని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ పార్థసారథి అన్నారు. బుద్దాలపాలెం గ్రామంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా చౌడు భూముల్లో వేరుశనగ, మినుము పంటలను పండిస్తున్న రైతుల పొలాలను వ్యవసాయ శాఖాధికారులు గురువారం సందర్శించారు. పొలాలకు ఎలాంటి ఎరువులు వినియోగించకుండా ప్రకృతి వ్యవసాయం ద్వారా మేలైన దిగుబడులు సాధిస్తున్న రైతులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ చౌడు భూముల్లో మినుము పంటను ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేయడం వలన పురుగు మందుల ఖర్చు తగ్గుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యకరమైన పంటను దిగుబడి చేసుకోవడం ద్వారా ఆరోగ్యానికి మేలు జరుగుతుందన్నారు. అలాగే వేరుశనగ పంటకు సంబంధించి విత్తనాలు మొలకెత్తడంతో మొలక శాతాన్ని గమనించి రైతులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. మండల వ్యవసాయాధికారి జీవీ శివ ప్రసాద్, బుద్దాలపాలెం పీఏసీఎస్ అధ్యక్షుడు వెంకన్న, క్షేత్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా రాష్ట్రంలో పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ నాయకుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా విడుదలైన నిధులతో నగరంలోని 38, 49 డివిజన్లలో చేపట్టిన సిమెంట్ రోడ్లు, పక్కా డ్రెయిన్ల నిర్మాణ పనులకు నగర మేయర్ మోకా వెంకటేశ్వరమ్మతో కలిసి ఆయన ప్రారంభించారు. పేర్ని కిట్టు మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తయిన డివిజన్లలో ప్రజల నుంచి వచ్చిన వినతులను పరిష్కరించేందుకు రూ. 20 లక్షలను కేటాయించారన్నారు. 38వ డివిజన్‌లో రూ. 20 లక్షల నిధులతో నాలుగు అభివృద్ధి పనులను చేపట్టామని చెప్పారు. 49వ డివిజన్‌లో కూడా గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ. 20 లక్షలతో పలు అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ నిధులతో చేపట్టిన పనులతో ఈ రెండు డివిజన్లలోని ప్రజల సమస్యలు కొంత వరకు పరిష్కారమవుతున్నాయన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, డెప్యూటీ మేయర్ తంటిపూడి కవిత థామస్ నోబుల్, వైఎస్సార్ సీపీ 38వ డివిజన్ ఇన్‌చార్జి శ్రీకాకోళపు నరసింహగుప్తా, 39వ డివిజన్ కార్పొరేటర్ పల్లి శేఖర్, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్లు శ్రీకాకోళపు రేణుకారాణి, సదురుద్దీన్, పలు డివిజన్ల కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, పార్టీ డివిజన్ ఇన్‌చార్జీలు, కన్వీనర్లు పాల్గొన్నారు.

నూతన పింఛన్ల పంపిణీ

నగరంలో నూతనంగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు వైఎస్సార్ సీపీ నాయకుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), నగర మేయర్ మోకా వెంకటేశ్వరమ్మతో కలిసి అందజేశారు. జనవరిలో సాంకేతిక కారణాలతో పింఛన్లు అందని 84 మందికి గురువారం నూతన పింఛన్లను అందజేశారు. రూ. 2.31 లక్షల మేర సొమ్మును లబ్ధిదారులకు అందజేశారు. స్థానిక రాజుపేట షాదీఖానా, 18వ డివిజన్ సచివాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమాల్లో లబ్ధిదారులకు పింఛను మొత్తాలను అందజేశారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జీలు, కన్వీనర్లు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

కలెక్టర్ రంజిత్‌బాషా



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రంజిత్‌బాషా. చిత్రంలో జేసీ అపరాజితసింగ్

చిలకలపూడి(మచిలీపట్నం): గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని కలెక్టర్ పి. రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి, సీసీఎల్ఏ కమిషనర్ సాయిప్రసాద్‌తో కలిసి గురువారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో రీ-సర్వే, గృహ నిర్మాణం, వ్యవసాయం, ఈ-క్రాప్ బుకింగ్, జాతీయ రహదారుల ప్రాజెక్టులకు భూ సేకరణ అంశాలపై సమీక్ష నిర్వహించారు.

అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రబీ ఈ-క్రాప్ బుకింగ్ 97 శాతం పూర్తయ్యిందన్నారు. వైఎస్సార్ యంత్ర సేవా పథకం అమలుకు 80 శాతం కమ్యూనిటీ హయరింగ్ సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. వ్యవసాయ యంత్ర పరికరాలు రైతు గ్రూపులకు పంపిణీ కోసం చర్యలు చేపడుతున్నామన్నారు. రైతు భరోసా కేంద్రాల పనితీరు మరింత మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో ఉద్యానవన పంటలను ప్రోత్సహించి రైతులు అధిక దిగుబడులు సాధించేలా, ఆర్థికంగా బలోపేతం కావడానికి కృషి చేయాలని చెప్పారు. 200 హెక్టార్లకు గానూ ఇప్పటివరకు 135 హెక్టార్లలో ఉద్యానపంటలు సాగు చేస్తున్నారన్నారు. జగనన్న శాశ్వత భూ హక్కు - భూ రక్ష పథకం కింద జిల్లాలో ఇప్పటివరకు 103 గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేసి 13వ నోటిఫికేషన్ జారీ చేశామన్నారు. 88 గ్రామాల్లో భూ హక్కు పత్రాలు కూడా తయారు చేశామన్నారు. జిల్లాలో గృహ నిర్మాణ ప్రగతికి సంబంధించి 93,245 గృహాలు మంజూరుకాగా ఇప్పటి వరకు 9,512 గృహాలు పూర్తయ్యాయని, మిగిలినవి వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. ఆయా లేఅవుట్లలో గృహాల లబ్ధిదారులకు తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నామని చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ అపరాజిత సింగ్, డీఆర్వో ఎం. వెంకటేశ్వర్లు, డ్వామా పీడీ సూర్యనారాయణ, సర్వే ఏడీ గోపాలరాజా, జిల్లా వ్యవసాయ శాఖాధికారి మనోహరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ వెళ్లి పింఛన్ల పంపిణీ

కృత్తివెన్ను: వలంటీర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు రెండో రోజు గురువారం ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా గురువారం సాయంత్రానికి 96 శాతం పింఛన్లు పంపిణీ చేశారని ఎంపీడీఓ పిచ్చిబాబు తెలిపారు. వలంటీర్ లాగిన్‌లో బయోమెట్రిక్ తీసుకోని వారికి వెల్ఫేర్ అసిస్టెంట్లు స్వయంగా లబ్ధిదారుల ఇండ్లకు వెళ్లి తమ లాగిన్ ద్వారా పింఛన్లను అందజేస్తున్నారు. ప్రతి ఇంటికి వెళ్లి నేరుగా పింఛన్ అందించడంతో వృద్ధులు, దివ్యాంగులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

94 శాతం పంపిణీ..

గూడూరు: గూడూరు మండలంలో ఫిబ్రవరి మాసానికి సంబంధించి 94 శాతం పెన్షన్ల పంపిణీ పూర్తయిందని ఎంపీడీఓ డి.సుబ్బారావు తెలిపారు. గ్రామ వలంటీర్లతో పాటు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో కలిసి స్థానిక ప్రజాప్రతినిధులు పెన్షన్లు పంపిణీ చేశారు. పోసినవారిపాలెం సచివాలయం పరిధిలో అత్యధికంగా 98.45 శాతం నమోదు కాగా 98.01 శాతంతో కంకటావ ద్వితీయ స్థానంలో ఉంది. మల్లవోలు-1 మినహా మిగిలిన అన్ని సచివాలయాలలో 90 శాతం పైగా పెన్షన్ల పంపిణీ చేశారు.

జిల్లాలో ద్వితీయస్థానం

మచిలీపట్నంటౌన్: నగరంలో సామాజిక పింఛన్ల పంపిణీ రెండో రోజైన గురువారం కొనసాగింది. 96.5 శాతం పింఛన్లను పంపిణీ చేసి జిల్లాలో ద్వితీయ స్థానంలో నిలిచింది. నగరంలో మొత్తం 18,775 పింఛన్లు ఉండగా వీటిలో 18,117 పింఛన్లు పంపిణీ చేశారు. ఇంకా 658 మంది పింఛనుదారులకు పంపిణీ చేయాల్సి ఉంది.

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం

ఏఎస్పీ సీతారామాంజనేయులు

మచిలీపట్నంటౌన్: ఏపీఎస్ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమని జిల్లా అడిషనల్ ఎస్పీ సీతారామాంజనేయులు అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల ముగింపు సందర్భంగా జిల్లాలో ఏపీఎస్ఆర్‌టీసీ డిపోల్లో ప్రమాద రహితంగా బస్సులు నడిపిన డ్రైవర్లకు సన్మాన కార్యక్రమం గురువారం స్థానిక ఆర్టీసీ గ్యారేజీలో నిర్వహించారు. ముఖ్య అతిథి ఏఎస్పీ మాట్లాడుతూ చిన్ననాటి నుంచి ఆర్టీసీ బస్సులో ప్రయాణించానని చెప్పారు. ఆర్టీసీ డ్రైవర్లు రోడ్డు భద్రతకు మారుపేరుగా విధులను నిర్వహిస్తారన్నారు. గత సంక్రాంతి పండుగ సందర్భంగా ఏపీఎస్ ఆర్టీసీ తీసుకున్న నిర్ణయాలతో పలు ప్రాంతాల నుంచి ప్రయాణికులు సురక్షితంగా రాకపోకలు సాగించారని చెప్పారు. డ్రైవర్లు వారి కుటుంబ సభ్యులతో దిగిన ఫొటోలను వారి ముందు పెట్టుకుని వాహనాలు నడిపితే అతి వేగాన్ని కొంతవరకు తగ్గించుకోగలుగుతారన్నారు. ఆర్టీసీలో ఈ విధానం అమలైతే ప్రైవేటు డ్రైవర్లు అనుసరిస్తారన్నారు. దీంతో ప్రమాదాలు తగ్గే అవకాశం ఉందని చెప్పారు. జిల్లా రవాణాశాఖ అధికారి పి. సీతాపతిరావు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణలో డ్రైవర్లదే కీలక పాత్ర అన్నారు. ఆర్టీసీలో పనిచేసే డ్రైవర్లు ప్రమాదాలు జరగకుండా ఇతరులకు మార్గదర్శకంగా వాహనాలు నడుపుతున్నారన్నారు. ప్రజా రవాణాధికారి జి. నాగేశ్వరరావు మాట్లాడారు. డిపో మేనేజర్ టి. పెద్దిరాజు అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో జిల్లాలోని పలు డిపోలకు చెందిన 28 మంది డ్రైవర్లు, ఎస్‌డీఐ, ఆర్ఎస్‌డీఐ, బ్రేక్ మెకానిక్‌లను సన్మానించి జ్ఞాపికలను, నగదు బహుమతులను అందజేశారు.

నేటి నుంచి వేణుగోపాలుడి బ్రహ్మోత్సవాలు

4న స్వామివార్ల కల్యాణం

కోడూరు: హంసలదీవి రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి వారి ఆలయంలో శుక్రవారం స్వామివార్ల బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ప్రతి ఏటా మాఘశుద్ధ త్రయోదశి నుంచి బహుళ పాడ్యమి వరకు ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పందిళ్లను ఏర్పాటు చేశారు. నూతన రంగులు, విద్యుత్‌దీపాలతో ముస్తాబు చేశారు. కల్యాణాన్ని తిలకించేందుకు రాష్ట్రం నలుమూల నుంచి వచ్చే భక్తులకు ఏవిధమైన అసౌకర్యాలు కలగకుండా చర్యలు చేపట్టామని ఈఓ సుధాకర్ తెలిపారు. ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబులు బ్రహ్మోత్సవాలను ప్రారంభిస్తారన్నారు. శుక్రవారం ఉదయం స్వామి వారికి విశేష స్నపన, పెండ్లి కుమారుడిగా అలంకరణ, సాయంత్రం విష్వక్సేన పూజ, పుణ్యావచనం, దీక్ష స్వీకరణ జరుగుతుంది. 4న ప్రత్యేక పూజలు, అభిషేకాలు, శ్రీరాజ్యలక్ష్మీ అమ్మవారికి లక్ష కుంకుమార్చన, సాయంత్రం నిత్యహోమం, జగజ్యోతి, ఆలయంలోని ఆరుబయట ఉన్న కల్యాణవేదికలో రాత్రికి స్వామివార్ల కల్యాణాన్ని నిర్వహిస్తారు. 5న ఉదయం సాగర సంగమం, పాలకాయతిప్ప బీచ్ వద్ద సింధు స్నానాలకు వచ్చే భక్తులతో ప్రత్యేక పూజలు, రాత్రికి స్వామివారి రథోత్సవం, 6న అవభృదోత్సవం, సాయంత్రం ధ్వజారోహణం, పూర్ణాహుతి, రాత్రికి స్వామివారి పవళింపు సేవతో ఉత్సవాలను ముగుస్తాయి.

15 నుంచి నాగేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

పెదకళ్లేపల్లి(మోపిదేవి): దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న పెదకళ్లేపల్లి కదళీపుర క్షేత్రంలోని దుర్గా పార్వతీ సమేత నాగేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 15 నుంచి 23వ తేదీ వరకు వైభవంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మహా శివరాత్రికి ప్రతి ఏటా ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి కూడా భక్తులు లక్షలాదిగా తరలివచ్చి ఉత్తర దిక్కుగా ప్రహిస్తున్న కృష్ణానదిలో స్నానమాచరించి దుర్గా నాగేశ్వరస్వామి వారిని దర్శించుకుంటారు.


వారం రోజులు కల్యాణోత్సవాలు..

ప్రతి ఏడాది మహాశివరాత్రికి స్వామి వారి కల్యాణోత్సవాలు వారం రోజులు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహిస్తారు. ఇక్కడ కృష్ణానది ఉత్తర దిక్కుగా ప్రవహించి సమీపంలోని సముద్రంలో కలుస్తోంది. ఈ ప్రాంతంలో పుణ్య స్నానాలు ఆచరించి పితృ దేవతలకు పిండ ప్రదానాలు చేస్తారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఉత్తర వాహినిలో పుణ్యస్నానాలు చేసి దుర్గా నాగేశ్వరస్వామి వారిని దర్శించుకుని తరిస్తారు. ఆలయం ఎదుట ప్రతిష్ఠించిన మహాశివుని విగ్రహం భక్తులను విశేషంగా ఆకర్షిస్తోంది.

బ్యాంక్ సేవలపై కళాజాతా ప్రదర్శన

చల్లపల్లి: కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంక్ రైతులకు అనేక పథకాల ద్వారా మేలు చేస్తోందని కళాకారులు తెలిపారు. గురువారం పాగోలు శివారు మేకావారిపాలెంలో రైతు భరోసా కేంద్రం ఎదుట కళాభారతి-బిళ్లపాడు కళాకారుల బృందం కళాజాతా ప్రదర్శన నిర్వహించారు. బ్యాంక్ సేవలను రైతులకు వివరించారు. సర్పంచ్ తోట శ్రీనివాసరావు, పీఏసీఎస్ చైర్మన్ వంగల శ్రీరామమూర్తి, సీఈఓ కోరుకొండ శ్రీనివాసరావు, కళాకారులు పాల్గొన్నారు.

కార్నియాల సేకరణ



రాఘవమ్మ

మచిలీపట్నంటౌన్: పెడనకు చెందిన మండవల్లి రాఘవమ్మ (95) గురువారం మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యులతో వైజ్‌మెన్ క్లబ్ రీజనల్ డైరెక్టర్ ఉడత్తు శ్రీనివాసరావు మాట్లాడి రాఘవమ్మ కార్నియాలను సేకరించారు. వీటిని హైదరాబాద్‌లోని వాసన్ ఐ బ్యాంక్‌కు తరలించారు. కార్నియాల సేకరణకు నాగ శ్యామలయ్య సహకరించారు.

అయోడిన్ ఉప్పునే వినియోగించండి

మచిలీపట్నంటౌన్: ప్రతి ఒక్కరు అయోడిన్ ఉప్పునే వినియోగించి ఆరోగ్యకరంగా జీవించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి గీతాబాయి అన్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో అయోడిన్ ఉప్పు వాడుతున్నదీ, లేనిదీ ఎన్‌సీడీ విభాగం కార్యాలయ పరిశీలకులు చంద్రశేఖర్, సుస్మితలతో కలిసి గీతాబాయి 33వ డివిజన్‌లోని మునిసిపల్ పాఠశాలను పరిశీలించారు. ఆహార పదార్థాల శాంపిళ్లను పరీక్షించి మాట్లాడారు. అయోడిన్ కలిగిన ఉప్పును వినియోగించటం వల్ల కలిగే లాభాలను పాఠశాల విద్యార్థులకు వివరించారు. అనంతరం వల్లైగూడెం అర్బన్ హెల్త్ సెంటర్‌ను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎన్‌సీడీ సెల్ ప్రోగ్రాం ఆఫీసర్ రత్నగిరి, అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ బొర్రా వైదేహి, మునిసిపల్ స్కూల్ ప్రధానోపాధ్యాయిని పి. శశికళ పాల్గొన్నారు.

కల్యాణమస్తు గోల్డ్ కాయిన్ అందజేత

పెదప్రోలు(మోపిదేవి): పెదప్రోలు పాల కేంద్రం సభ్యుడు కొల్లూరు ఆంజనేయులు కుమార్తె వివాహం సందర్భంగా కల్యాణమస్తు పథకం కింద విజయ డెయిరీ కృష్ణా మిల్క్ యూనియన్ నాలుగు గ్రాముల గోల్డ్ కాయిన్‌ను పెళ్లికుమార్తెకు గురువారం అందజేశారు. సంఘం అధ్యక్షుడు నాదెళ్ల భవాని శంకర్ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పామర్రు పాల శీతలీకరణ మేనేజర్ సీహెచ్ దామోదర కృష్ణ గోపీనాథ్, రూట్ ఏఎంపీఓ ఎం. వరప్రసాద్, సంఘ సిబ్బంది కె. రాము, డి అర్జునరావు, సభ్యులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి

బంటుమిల్లి: ఆటో, ద్విచక్ర వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాలు నివారించాలని ఎస్ఐ ఎ. పైడిబాబు అన్నారు. గురువారం 216 జాతీయ రహదారిపై వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, ఆటోవాలాలు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దని, కారులు నడిపే వారు సీటు బెల్ట్ ధరించి వేగం నియంత్రించి ప్రమాదాలకు దూరంగా ఉండాలని చెప్పారు.

విద్యార్థులు ప్రణాళికతో చదవాలి

చల్లపల్లి: విద్యార్థులు ప్రణాళికతో చదివి లక్ష్యాలు సాధించాలని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ విడియాల చక్రవర్తి అన్నారు. స్థానిక ఎస్ఆర్‌వైఎస్‌పీ హైస్కూల్‌లో గురువారం శ్రీమంతురాజా యార్లగడ్డ శివరామ ప్రసాద్ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థుల అసోసియేషన్ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాస అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎదిగేందుకు తీసుకోవాల్సిన శ్రద్ధ, పాటించాల్సిన మార్గదర్శకాలు వివరించారు. హైస్కూల్ ఇన్‌చార్జీలు ఎస్.సుదర్శనధర ప్రసాద్, తుమ్మల రేణుప్రసాద్ పర్యవేక్షించారు.

నగల వ్యాపారికి టోకరా

డాక్టర్ నంటూ ఫోన్‌చేసి నక్లెస్ తీసుకుని ఉడాయింపు

కోనేరుసెంటర్: మచిలీపట్నంలో ఓ వ్యక్తి సినీ ఫక్కీలో చోరీకి పాల్పడ్డాడు. ఓ బంగారు దుకాణానికి ఫోన్ చేసి ఆభరణాలు తెప్పించుకుని మరీ బంగారు వస్తువులను అపహరించాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మచిలీపట్నంలోని ఓ బంగారు దుకాణానికి గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి తాను సర్వజన ఆస్పత్రిలో వైద్యుడిని అని, బంధువుల ఇంట్లో జరిగే శుభ కార్యక్రమానికి వీలైనంత త్వరగా వెళ్లాల్సి వచ్చిందని చెప్పాడు. మంచి మోడల్‌లో ఉండే నక్లెస్‌ను తన రూము వద్దకు తీసుకుని వస్తే డబ్బులు అక్కడే ఇస్తానంటూ నమ్మించాడు. ఫోన్‌లో మాట్లాడిన వ్యాపారి ఉడత్తు శివకార్తీక్ సుమారు 17 గ్రాములకు పైగా బరువు ఉన్న బంగారు ఆభరణాన్ని ఆస్పత్రిలో అతను చెప్పిన రూము వద్దకు తీసుకువెళ్లాడు. కార్తీక్ వద్ద ఉన్న వస్తువు తీసుకున్న సదరు వ్యక్తి గదిలోకి వెళ్లాడు. గదిలోకి వెళ్లిన వ్యక్తి ఎంతకీ బయటికి రాకపోవడంతో గుమ్మం వద్దనే వేచి ఉన్న కార్తీక్ ఓపిక నశించి తలుపు తట్టినా సదరు వ్యక్తి నుంచి ఎలాంటి సమాధానం రాలేదు. అనుమానం వచ్చిన కార్తీక్ తలుపుపై నుంచి చూడగా వెనుక వైపు గోడకు కిటికీ లేదు. అప్పటికే అతను పరారయ్యాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రేపు ఉచిత మెగా వైద్యశిబిరం

అవనిగడ్డ: తిప్పపాలెంలో శనివారం ఉచిత మెగా వైద్యశిబిరం ఏర్పాటుచేశామని నిర్వాహకులు కమ్మిలి వెంకట సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక అభయాంజనేయ స్వామి ఆలయం ప్రాంగణం వద్ద జరిగే శిబిరంలో పిల్లల వైద్యులు పీకేఎస్ వెంకటరమణ, డాక్టర్ కమ్మిలి విలీన, డాక్టర్ కమ్మిలి హరీష్, డాక్టర్ కె. శ్రీనివాస్, డాక్టర్ కేవీ లక్ష్మీ వైద్యసేవలు అందిస్తారని చెప్పారు.